సాక్షి
గుంటూరు
గురువారం । 14 । నవంబర్ । 2024



భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

రాజుపాలెం: గ్రామంలోని జయంతి కాలనీ శ్రీవైష్ణవ హరిదాసుల సంఘం ఆధ్వర్యంలో మంగళ కైశిక ద్వాదశి నగర సంకీర్తన బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానానికి తెనాలికి చెందిన బొర్రా రవికుమార్ కుటుంబం బుధవారం రూ. 1.21 లక్షల విరాళం అందజేసింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4709, హై లెవల్ కాలువకు 153 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ఎక్సైజ్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



మంగళగిరి: నగర పరిధిలోని ఎక్సైజ్ స్టేషన్‌ను బుధవారం డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ రాహుల్ దేవ్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలుత రాహుల్ దేవ్ శర్మకు సీఐ వీరాంజనేయులు, ఎస్‌ఐలు, సిబ్బంది స్వాగతం పలికారు.

సినీ నటుడు పోసానిపై ఫిర్యాదు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): సినీ నటుడు పోసాని కృష్ణ మురళీపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో తెలుగు యువత నాయకుడు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు రవీంద్రనగర్ ప్రాంతానికి చెందిన తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు దియ్యా రామకృష్ణప్రసాద్ సినీ నటుడు పోసాని కృష్ణ మురళీ మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీటీడీ చైర్మన్ బి.ఆర్ నాయుడు పై చేసిన వ్యాఖ్యల పట్ల అనేక మంది భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని, పోసాని కృష్ణ మురళీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఆచార్య గంగప్ప సాహితీ పరిశోధనలు గర్వకారణం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఆచార్య గంగప్ప సాహితీ పరిశోధనలు గర్వకారణమని కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ ఈవీ నారాయణ అన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై బుధవారం సాయంత్రం ఆచార్య గంగప్ప స్మారక సాహిత్య పురస్కార కమిటీ ఆధ్వర్యంలో 'ఆచార్య గంగప్ప 28వ సాహితీ పురస్కారం- 2024' ప్రముఖ సాహిత్యవేత్త, అనువాద రచయిత డాక్టర్ తుర్లపాటి రాజేశ్వరీదేవికి అందజేసి, నగదు పురస్కారంతో సత్కరించారు. సభకు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. కార్యక్ర మంలో ఆలయ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ఆచార్య జీవీ చలం, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు, డాక్టర్ జక్కంపూడి సీతారామారావు, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, సాహితివేత్తలు, ఆచార్య గంగప్ప కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

తాడికొండ: అర్ధరాత్రి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని పట్టుకుని సీజ్ చేసినట్లు తుళ్లూరు ఎస్‌ఐ కొండలు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహిస్తుండగా వెలగపూడి వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక లోడుతో వస్తున్న లారీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శబరిమల యాత్రకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): అయ్యప్ప స్వాముల శబరిమల యాత్రకు, కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పంచారామాలకు వెళ్లే వారి కోసం ఏపీఎస్‌ఆర్టీసీ స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం ఎం. రవికాంత్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ బస్టాండ్‌లో స్పెషల్ బస్సుల కరపత్రాలను ఆవిష్కరించారు. శబరిమల వెళ్లే సమయంలో బస్సు సర్వీసు కాణిపాకం, భవానీ, ఎరిమేలి, పంబా మీదుగా వెళ్లి వచ్చేటప్పుడు కుర్తాళం, మధురై, చెన్నై, మేల్మరువత్తూరు మీదుగా గుంటూరు చేరుకుంటుందన్నారు. ఒకేరోజులో పంచారామాలు, త్రి శైవక్షేత్రాలు దర్శించుకునేందుకు ప్రత్యేక బస్సులు వేసినట్టు వెల్లడించారు. బస్సులు ప్రతి శని, ఆదివారం రాత్రి 9 గంటలకు గుంటూరు నుంచి బయలుదేరతాయని చెప్పారు.

ప్రతిభా బాలాద్భ్యులు

- లిటిల్ చాంప్స్
- వివిధ రంగాల్లో రాణిస్తున్న బాలలు
- అద్భుత ప్రతిభతో కీర్తిప్రఖ్యాతులు
- సత్తాచాటుతున్న గుంటూరు జిల్లా చిచ్చరపిడుగులు

అద్భుత ప్రతిభతో అందరినీ అబ్బురపరుస్తున్నారు పలువురు బాలలు. అపార మేధాశక్తితో ఆశ్చర్యచకితులను చేస్తున్నారు. కండ, బుద్ధి బలాలతో పిట్ట కొంచెం కూత ఘనం అని నిరూపిస్తున్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా కొందరు చిచ్చరపిడుగులు సాధించిన అద్వితీయ విజయాలు ఇవీ..



ఆమె ప్రతిభ ఎట్టిది 'అనఘా'

గణిత ఘనాపాఠి



చిర్రా అనఘాలక్ష్మి (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరానికి చెందిన చిర్రా అనఘా లక్ష్మి అద్భుత మేధా శక్తితో రాణిస్తోంది. 13 ఏళ్ల వయసులోనే సీనియర్ ఇంటర్ చదువుతోంది. ఆరో తరగతి చదువుతున్నప్పుడే ఆమెలోని ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు సత్యదేవి, విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. దీంతో 2023 మార్చిలో అప్పటి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ప్రత్యేక అనుమతితో ఏకంగా టెన్త్ పరీక్షలు రాసి 600 మార్కులకు 566 సాధించింది. గత జూనియర్ ఇంటర్ ఫలితాల్లో 470 మార్కులకు 454 సాధించింది. 10 ఏళ్ల వయసులోనే గణితంలో శతావధానం చేసి రికార్డు సృష్టించింది. అబాకస్, వేదగణితంలోనూ సత్తాచాటుతోంది. చిన్నారి ప్రతిభను చూసి అందరూ ముగ్ధులవుతున్నారు.

పతకాలతో 'షేక్'హ్యాండ్

తైక్వాండో చిచ్చరపిడుగు



తైక్వాండో ప్రదర్శనలో సనాఫాతిమా

తెనాలి: మార్షల్ ఆర్ట్స్ తైక్వాండోలో రాణిస్తోందీ చిన్నారి షేక్ సనాఫాతిమా. స్థానిక నెహ్రూనికేతన్‌లో ఆరోతరగతి చదువుతోంది. తల్లిదండ్రులు ముజాహిదా సుల్తానా, ఆరిఫ్‌ల ప్రోత్సాహంతో కోచ్ శ్రీనివాసరావు శిక్షణలో తైక్వాండోలో రెండేళ్లుగా సాధన చేస్తోంది. పలు పోటీల్లో పాల్గొని ఎల్లో, ఎల్లోవన్, గ్రీన్, గ్రీన్‌వన్ బెల్ట్‌లను సాధించింది. రేపల్లెలో జరిగిన తొలి జాతీయ ట్రెడిషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2023లో అండర్-12 బాలికల విభాగంలో రజత పతకాన్ని సాధించింది. గత జూలైలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ జూనియర్స్ విభాగంలో కాంస్యం గెలిచింది. గత నెలలో తెనాలిలో జరిగిన నాలుగో రాష్ట్రస్థాయ తైక్వాండోలోనూ కాంస్య పతకాన్ని సాధించింది. ఇటీవల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లోనూ కాంస్యంతో విజయహాసం చేసింది. ఆత్మరక్షణ విద్య నేర్పించాలనే భావనతో తమ బిడ్డకు తైక్వాండో నేర్పిస్తున్నామనీ, పోటీల్లో పతకాలు కూడా గెల్చుకోవటం సంతోషంగా ఉందని ఆరిఫ్ అన్నారు.

'మెమరబుల్' ట్యాలెంట్

మూడేళ్ల బుడతడి అద్భుతం



తల్లిదండ్రులతో ప్రదీప్ నారాయణ

తెనాలి: తెనాలి మండలం గుడివాడకు చెందిన చిన్నారి బండికళ్ల ప్రదీప్ నారాయణ్ అద్వితీయ జ్ఞాపకశక్తితో అందరినీ అబ్బురపరుస్తున్నాడు. జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సాధిస్తున్నాడు. 11వ నెల వయసు నుంచే జంతువులు, పక్షులు, పండ్లు, కూరగాయలు, మానవ శరీర భాగాలు, గృహోపకరణాలతో సహా మొత్తం 150 పేర్లను గుర్తిస్తూ, 11 నిముషాల్లోనే వాటిని చెబుతున్నాడు. ప్రస్తుతం ఈ బుడతడి వయసు మూడేళ్లు. భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ గుర్తింపును పొందిన బెంగళూరు వెయిల్ ఫౌండేషన్ ప్రదానం చేసిన ఇండో స్పానిష్ ఇంటర్నేషనల్ అవార్డు-2024తో సహా తొమ్మిది ప్రపంచ రికార్డులను, మూడు జాతీయ రికార్డులను అందుకున్నాడు. ఇప్పుడు జాతీయ గీతం 'జనగణమన'ను 52 సెకన్లలో పాడుతున్నాడు. ఈ ప్రదర్శనకు అమూల్ భగత్ మీడియా చైల్డ్ ఆఫ్ ది ఇయర్ విభాగంలో దాదా సాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ మోటివేషనల్ అవార్డును గత జూలై 29న ముంబయిలో ప్రదానం చేసింది. అంతకుముందు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ నుంచి ధ్రువీకరణ పొందిన పంజాబ్‌లోని లూధియానాకు చెందిన ఫ్లాంక్‌టన్ ఎంటర్‌ప్రైజెస్ నేషనల్ ప్రెస్టీజ్ అవార్డు-2024నూ ప్రదీప్ అందుకున్నాడు. ప్రదీప్ నారాయణ్ తల్లిదండ్రులు బండికళ్ల రాజేష్, గుణప్రియ ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. పసివయసులో బిడ్డలోని జ్ఞాపకశక్తిని గుర్తించి, తగిన విధంగా తర్ఫీదు ఇచ్చినట్టు తండ్రి రాజేష్ వెల్లడించారు.

'పవర్'ఫుల్ తనుశ్రీ

పతకాల 'బంగారం'



సాధించిన పతకాలతో తనుశ్రీ

తెనాలి: స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థిని డి.తనుశ్రీ పవర్‌లిఫ్టింగ్‌లో అద్భుత ప్రతిభ చాటుతోంది. తొమ్మిదో తరగతి చదువుతున్న తనుశ్రీ, రెండు నెలల క్రితం పవర్ లిఫ్టింగ్ సాధన ఆరంభించింది. స్థానిక స్టేడియంలోని కోచ్ గోపీ శిక్షణలో పట్టుదలతో సాధన చేసింది. ఈనెల 8 నుంచి 10 వరకు భీమవరంలో జరిగిన అమరావతి పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తనుశ్రీ పాల్గొంది. 84 ప్లస్ కేటగిరీలో స్క్వాట్స్ 55 కిలోలు, బెంచ్ ప్రెస్ 25 కిలోలు, డెడ్‌లిఫ్ట్ 85 కిలోల చొప్పున మొత్తం 165 కిలోల బరువులనెత్తి మూడు బంగారు పతకాలను గెలుచుకుని మోతమోగించింది. అందరి అభినందనలు అందుకుంది.

మిర్చి సీజన్ నాటికి పెండింగ్ పనులు పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

కొరిటిపాడు(గుంటూరు): త్వరలో ప్రారంభం కానున్న మిర్చి సీజన్ నాటికి యార్డులో పెండింగ్ పనులు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్, యార్డు పర్సన్ ఇన్‌చార్జి ఎ.భార్గవ్ తేజ సూచించారు. రాబోవు సీజన్‌కు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై మిర్చి దిగుమతి వ్యాపారులు, యార్డు అధికారులు, వేమెన్స్‌తో బుధవారం సాయంత్రం ఆయన సమీక్ష నిర్వహించారు. మిర్చి రైతులు, హమాలీలు, వ్యాపారులకు ఎలాంటి సమస్యలూ ఉత్పన్నం కాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులు ఏ రోజు తెచ్చిన మిర్చి బస్తాలు ఆరోజే అమ్ముకొని వెళ్ళేలా చూడాలని, రైతులకు పేమెంట్ కూడా ఆరోజే చేయాలని ఆదేశించారు. కమీషన్ షాపుల వారు యార్డులో రెడ్ గీత దాటి మిర్చి బస్తాలు వేయరాదన్నారు. జీరో వ్యాపారం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. తూకాల్లో మోసాలు జరగకుండా స్టాంపింగ్ వేసిన వేయింగ్ మిషన్లనే వినియోగించేలా చూడాలన్నారు. యార్డు లోపలికి వచ్చే ప్రతి మిర్చి బస్తాను ఎంట్రీ చేయాలన్నారు. ఎగుమతి వ్యాపారులతో బిడ్డింగ్ వేయించాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని వివరించారు. సమావేశంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు, అధికారులు సుబ్రమణ్యం, శ్రీకాంత్, దిగుమతి వ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షుడు లేళ్ల పెద అప్పిరెడ్డి, కుర్రి సాంబిరెడ్డి, కొత్తూరి సుధాకర్, నరేంద్ర, పలువురు అసోసియేషన్ నాయకులు, వేమెన్స్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు రౌడీయిజం చేస్తున్నారు



రాజశేఖర్‌రెడ్డి తరఫున నూజివీడు పోలీసుల నుంచి నోటీసులు అందుకుంటున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు

- రాజశేఖర్‌రెడ్డిపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తే సహించేదిలేదు
- మాజీమంత్రి అంబటి రాంబాబు హెచ్చరిక

లక్ష్మీపురం (గుంటూరు ఈస్ట్) : రాష్ట్రంలో కొంత మంది పోలీసు ఉన్నతాధికారులు చంద్రబాబు చెప్పినట్లుగా నడుచుకుంటూ రౌడీయిజం చేస్తున్నారని, ఇలా చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారిని రానున్న రోజుల్లో చట్టం ముందు నిలబెడతామని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు హెచ్చరించారు. గుంటూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. ''సత్తెనపల్లి నియోజకవర్గం నకరికల్లు గ్రామానికి చెందిన పొలూరి రాజశేఖర్‌రెడ్డిని మంగళవారం జిల్లా జైలు ముందు మీడియా సమక్షంలో తాను హాజరుపర్చి రాజశేఖర్‌రెడ్డి తన వద్దే ఉన్నాడని పోలీసులకు చెప్పి బుధవారం ఉదయం 10.30 గంటలకు నూజివీడు పోలీసులకు అప్పజెప్పాను. ఇక గురువారం 10.30 గంటలకల్లా ఆయనను కోర్టులో హాజరుపర్చాలి. రాజశేఖర్‌రెడ్డిపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తే సహించేది లేదు. ఎక్కడైనా కొట్టినట్లు తెలిస్తే వారి సంగతి ఖచ్చితంగా తేలుస్తాం. కోర్టులో ప్రైవేట్ కేసు వేస్తాం. నాలుగు రోజులుగా నూజివీడు పోలీసులు రాజశేఖర్‌రెడ్డికి ఫోన్లు చేశారు. ఆయన అన్నకు ఫోన్లుచేసి వేధిస్తూ బెదిరించారు. ఇక మా మీద పోస్ట్ పెట్టిన సంగతి ఏంటి? నా భార్య, నా పిల్లలపై దారుణంగా, అసభ్యకరంగా పోస్టులు పెడుతుంటే పోలీసులకు సంతోషంగా ఉందా? మాతో పాటు మా పార్టీ అధినేత వైఎస్ జగన్, ఆయన సతీమణీ, వైఎస్సార్ సీపీ నేతలపైనా పెట్టిన పోస్టుల సంగతి ఏమిటి? ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు మేం ఫిర్యాదు చేశాం. కానీ ఇంతవరకు వాటిపై చర్యలు తీసుకోలేదు. ఈ పోస్టింగులు వెనుక నారా లోకేశ్ ఉన్నారు. అందరూ సమానమంటున్న చంద్రబాబు మా సోషల్ మీడియాను తొక్కేసి, టీడీపీ సోషల్ మీడియాను హైప్ చేయాలని చూస్తున్నారు. టీడీపీ పెడుతున్న ఒక్క కేసు కూడా న్యాయస్థానాల్లో నిలబడదు. సోషల్ మీడియా కార్యకర్తలకు తీవ్రవాదులు, దేశద్రోహులు మాదిరిగా ముసుగులు వేసి అరెస్టులు చూపిస్తున్నారు. ఇక పవన్‌కళ్యాణ్ చంద్రబాబు స్క్రిప్ట్ చదువుతున్నారు. బాబు స్క్రిప్ట్ చదవాల్సింది పవన్ కాదు లోకేశ్. పవన్‌కళ్యాణ్ తన సొంత బుర్రను ఉపయోగించాలి.'' అని అంబటి పేర్కొన్నారు.

అవార్డులతో బాధ్యత మరింత పెరగాలి

డీఈఓ రేణుక



ఉపాధ్యాయినులను అభినందిస్తున్న డీఈవో రేణుక, ఖాసిం, ఖుద్దూస్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వం నుంచి అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పని చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. ఈనెల 11న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా నుంచి ఉర్దూ విభాగంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్న వారిని బుధవారం డీఈఓ తన కార్యాలయంలో అభినందించారు. ఉర్దూకు మంచి భవిష్యత్తు ఉందని, ఉర్దూ నేర్చుకోవడం ద్వారా అనేక రంగాల్లో రాణించవచ్చునని చెప్పారు. ఈ సందర్భంగా పురస్కారాలు పొందిన అహ్మదున్నీసా (ఎంపీపీ స్కూల్, నులకపేట, తాడేపల్లి), ఆర్.నాగమణి (నగరపాలకసంస్థ పాఠశాల, అహ్మద్‌నగర్, గుంటూరు), షేక్ రిజ్వానా బేగం (నగరపాలకసంస్థ పాఠశాల, సంగడిగుంట, గుంటూరు)ను అభినందించారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్, మైనార్టీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు సయ్యద్ ఇసాక్, జిలానీ పాల్గొన్నారు.

తాడోపేడోకు సిద్ధం



ఆందోళన చేస్తున్న తాడేపల్లి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

- తాడేపల్లి సిమెంట్ కార్మికుల ఆందోళన ఉధృతం
- న్యాయం చేయకపోతే ఆమరణ దీక్షకు సిద్ధమని ప్రకటన
- రావాల్సిన బకాయిలు చెల్లించకపోతే ఫ్యాక్టరీ స్థలం ఆక్రమణకు అల్టిమేటం
- ఇప్పటికే స్థలంలో పాకలు వేసి నిరసన దీక్షలు చేస్తున్న కార్మికులు
- ఫ్యాక్టరీ స్థలాన్ని కొనుగోలు చేసిన బాలశౌరీ, ఆలపాటి రాజా!
- ఎన్నికల ముందు హామీ ఇచ్చి తర్వాత గాలికి వదిలేసిన లోకేష్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తాడేపల్లిలో 31 ఏళ్ల కిందట మూతపడిన సిమెంట్ కంపెనీ కార్మికులకు రావాల్సిన బకాయిలు, నష్టపరిహారం కోసం కార్మికులు ఆందోళన ఉధృతం చేశారు. తమకు న్యాయం చేయకుంటే ఆమరణ దీక్షకు సిద్ధమని ప్రకటించారు. అయినా యాజమాన్యాలు, స్థలం కొనుగోలు చేసిన వారు కోర్టు తీర్పునూ పట్టించుకోకపోవడంతో సిమెంట్ ఫ్యాక్టరీ స్థలంలో పాకలు వేశారు. రోజూ నిరసన దీక్షలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో ఇప్పుడు స్థలం కొన్నవారం దరూ ప్రభుత్వంలో ఉండటంతో కార్మికులకు న్యాయం జరిగే పరిస్థితి లేకుండా పోయింది. మరోవైపు ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మంత్రి నారా లోకేష్ కూడా ఇప్పుడు కార్మికులను దగ్గరకు కూడా రానీయడం లేదు.

వివరాలు కోరి అలసత్వం

ఇటీవల ఈ భూములను చదును చేయడం కోసం వచ్చిన ఎస్‌ఆర్‌ఐ సంస్థ పొక్లెయిన్లను కార్మికులు అడ్డుకుని వెనక్కి పంపారు. ఎస్‌ఆర్‌ఐ ప్రతినిధులు కార్మికులతో చర్చలు జరిపి ఎంత రావాలో వివరాలు ఇవ్వాలని కోరారు. వివరాలు ఇచ్చి నాలుగు నెలలు దాటినా స్పందన లేకపోవడంతో కార్మికులు మళ్లీ ఆందోళనబాట పట్టారు. కార్మిక నాయకులపై బైండోవర్లు పెట్టించడం ద్వారా వారి ఆందోళనను అణిచివేయడానికి కూటమి ప్రభుత్వం యత్నాలు చేస్తోంది. ఎన్నికల ముందు సిమెంట్ కంపెనీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. లోకేష్ న్యాయం చేస్తారనే ఆలోచనతో ప్రజా దర్బార్‌కూ కార్మికులు వెళ్లారు. లోకేష్ డబ్బులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు లోకేష్ ముఖం చాటేశారు. ఆయన సిబ్బంది కార్మికులను రావద్దని కరాఖండీగా చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ భూములఎ.ఏసీసీ సిమెంట్స్ నుంచి పవర్ ఆఫ్ అటార్నీ తీసుకున్న బాలాజీ గురుప్రసాద్ అనే వ్యక్తి ఒక్కొక్కటిగా ప్రైవేటు వ్యక్తులకు అమ్ముతుండటంతో కార్మికులు ఆందోళన చెంది భూముల ఆక్రమణకు సిద్ధపడ్డారు.

అసలేం జరిగిందంటే..

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీని 1989లో ఎఫ్ఐఎల్‌కు తర్వాత హెచ్ఎంపీ అనే సంస్థలకు పది రూపాయల స్టాంప్ పేపర్‌పైన బదిలీ చేసింది. 1993లో ఉద్యోగులకు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ప్రకటించి అదే ఏడాది మే 29న అర్ధరాత్రి అక్రమ లాకౌట్ ప్రకటించింది. స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు సంతకాలు చేసిన కార్మికులకూ డబ్బులు ఇవ్వకుండా మోసం చేసింది. తర్వాత ఈ భూములను కోల్‌కతా కోర్టులో వేలం వేస్తే ప్రస్తుత మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరీతో పాటు మరికొందరు కలిసి కొన్నారు. తర్వాత దీన్ని ఎస్‌ఆర్‌ఐ అకాడమీకి అమ్మినట్లు చూపించారు. ఆ సమయంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ జోక్యం చేసుకుని ఫ్యాక్టరీని పూర్తిగా తొలగించి, స్థలాన్ని చదును చేయించారు. కార్మికులపై బెదిరింపులకు దిగారు. 2015లో కార్మికులకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చింది. సెంట్రల్ లేబర్ కోర్టు, హైకోర్టులు ఏసీసీ కార్మికులకు రూ.43 కోట్లు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాయి. ఈ ఆదేశాలను అమలు చేసే నాథుడు లేకుండా పోయాడు. భూమి కొన్నవారు కార్మికులకు డబ్బులు చెల్లించాల్సి ఉంది. అయితే ఈ భూములు కొన్నవారు డబ్బులు చెల్లించడానికి ముందుకు రావడం లేదు. ఇక్కడ ఎకరం పది కోట్ల రూపాయలపైనే ఉంది. 130 ఎకరాలకుపైనే ఫ్యాక్టరీ భూములు ఉన్నాయని, అందులో పది ఎకరాలు అమ్మినా తమ బకాయిలన్నీ తీరిపోతాయని కార్మికులు చెబుతున్నారు. ఇప్పటికే 170 మంది వరకూ కార్మికులు అర్ధాకలితో అనారోగ్య సమస్యలతో మృత్యువాత పడ్డారు.

బకాయిలు చెల్లించండి



333 మంది ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులను రోడ్డున పడేశారు. న్యాయస్థానాలు కార్మికులకు అనుకూలంగా తీర్పు ఇచ్చాయి. అయినా న్యాయం జరగడం లేదు. అనధికారికంగా ఫ్యాక్టరీ భూములు అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా బకాయిలు చెల్లించాలి. లేదా భూములు మాకు అప్పగించాలి.

– మెల్లెంపూడి ఆశీర్వాదం

పిల్లల చదువులు అర్ధంతరంగా ఆగిపోయాయి



నా భర్త సిమెంట్ ఫ్యాక్టరీలో వెల్డర్. మా ఆయనకు అప్పుడే మంచి జీతం ఇచ్చి క్వార్టర్స్ ఇచ్చారు. అర్ధంతరంగా సిమెంట్ ఫ్యాక్టరీ మూసివేయడంతో పిల్లల చదువులు ఆగిపోయాయి. నా భర్త దిగులుతో అనారోగ్యంపాలై చనిపోయాడు. మా బకాయిలు ఇప్పిస్తే పిల్లలకు న్యాయం జరుగుతుంది.

శివమల్లికమ్మ, బ్రహ్మానందపురం

డెప్యూటీ సీఎంను కలుస్తాం



ముఖ్యమంత్రి దగ్గర నుంచి మంత్రి నారా లోకేష్ వరకు అందరినీ కలిశాం. ఎవరూ స్పష్టమైన హామీ ఇవ్వలేదు. డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిసి బాధ చెప్పుకుంటాం. మా కుటుంబం మొత్తం రోడ్డున పడింది. పిల్లల్ని సరిగ్గా చదివించలేకపోయాం. దిగులుతో నా భర్త గుండెపోటుతో మృతి చెందాడు. నా పెద్దకొడుకుపై కుటుంబ భారం పడడంతో మోకాళ్లు అరిగిపోయాయి. అవి బాగుచేయడానికి రూ.మూడు లక్షలు అయింది. మాకు న్యాయయం చేయాలి.

– తుపాకుల అంజమ్మ, బ్రహ్మానందపురం

చట్ట విరుద్ధంగా లాకౌట్



1976లో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీలో చేరాను. 1993లో అక్రమంగా లాకౌట్ చేశారు. మా బకాయిలు చెల్లించలేదు. ఇప్పటికి 30 ఏళ్లయింది. ఎమ్మెల్యేలు, మంత్రుల దగ్గరకు వెళుతున్నాం. న్యాయం జరగడం లేదు. తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాం.

– కూరపాటి స్టీవెన్